



అర్ధాంతరంగా నిలిచిన ఓపెన్‌హెడ్ చానెల్

ఎప్పటికో నేరెడీ?

- నేరడి బ్యారేజ్‌కు కదలిక వచ్చేనా? ● ఆరు దశాబ్దాలుగా నలుగుతున్న ప్రతిపాదనలు ● బ్యారేజ్‌తో 2.5 లక్షల ఎకరాలు సస్యశ్యామలం
- అర్ధాంతరంగా నిలిచిన వరద కాలువ పనులు ● ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు అనుకూలం ● రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

భామిని:

ఏళ్లు గడుస్తున్నా.. నేరడి బ్యారేజ్‌కు మోక్షం కలగడం లేదు. ప్రతిపాదనలతో నలుగుతోంది తప్ప పనులు ప్రారంభం కావడం లేదు. వరద కాలువల నిర్మాణం సైతం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీని నిర్మాణంతో 2.5 లక్షల ఎకరాలు సస్యశ్యామలం కానున్నాయి. అయినప్పటికీ బ్యారేజీ నిర్మాణానికి అడుగులు పడడం లేదు. వాస్తవంగా ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో వృథాగా పోతున్న వంశధార జలాలను సాగుకు వినియోగించుకొనేందుకు 1962లో ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మన రాష్ట్రంలోని నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని తలపెట్టాయి. కానీ వివిధ కారణాలతో ఆరు దశాబ్దాలు గడిచినా బ్యారేజ్ పనులు ముందుకు సాగడం లేదు. తాజాగా ఇరు రాష్ట్రాల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం కొలువుదీరింది. నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా సాగునీటి వనరుల అభివృద్ధికి కృషి చేస్తానని గతంలో ప్రకటించారు. దీంతో బ్యారేజ్ పనులకు మోక్షం లభించే అవకాశం ఉందని ఇరు రాష్ట్రాల రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నేరడి బ్యారేజ్ నిర్మాణ ప్రతిపాదిత స్థలం

పనులు మొదలుపెట్టి...

వంశధార వరదనీటి వృథాకు బ్రేకులు వేసేందుకు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2005లో జలయజ్ఞం పథకం కింద రూ.933 కోట్లు మంజూరు చేశారు. దీనితో 2006లో హుటాహుటిన పనులు ప్రారంభించారు. వీటిపై ఒడిశా ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. వంశధార నదిని మళ్లిస్తున్నారని కేంద్ర జలవనరుల శాఖకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రబాబునాయుడు ట్రిబ్యునల్‌తో పోరాడి అనుమతులు సాధించారు. వరద కాలువ నిర్మాణానికి ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పడంతో 2018లో కాట్రగడలో నిర్మించిన హెడ్ రెగ్యులేటర్ ద్వారా హిరమండలంలోని వంశధార జలాశయానికి నీరిచ్చేందుకు 2018లో ప్రయత్నం చేశారు. ఆమేరకు రిజర్వాయర్‌కు నీరు అందించారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. పనులు నిలిచిపోయాయి.

వైసీపీ హామీ ఇచ్చినా...

వైసీపీ ప్రభుత్వ హయాంలో నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు కాట్రగడ పనులు, నేరడి బ్యారేజ్ ప్రతిపాదనా స్థలాన్ని పరిశీలించారు. పనులు చేపడతామని బీరాలు పలికారు. అప్పట్లో ఒడిశా నుంచి రైతులు వచ్చి సరైన ధరలు ఇస్తే.. తాము భూములు ఇచ్చేందుకు సిద్ధమని మంత్రికి వినతిపత్రాలు అందించారు. 106 ఎకరాల భూమి సేకరించి... సహకరిస్తామని తెలిపారు. మంత్రితో పాటు నాయకులు స్పందిస్తూ నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ఒడిశా ముఖ్యమంత్రితో మాట్లాడతామని వాగ్దానం చేసి... మరచిపోయారు.



పనులకు నోచుకోని సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

ఒడిశాలో భూసేకరణ తప్పనిసరి..

నేరడి బ్యారేజ్ నిర్మించాలంటే ఒడిశా భూభాగంలో 106 ఎకరాలు సేకరించాల్సి ఉంది. దీనికి ఆ ప్రభుత్వం సహకరించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. వరదనీటిని సరిభాగంగా చేసి... చెరో 8 టీఎంసీల నీటిని వినియోగించుకోవాలనేది ట్రిబ్యునల్ తీర్పు. బ్యారేజ్ నిర్మాణానికి 2017లోనే ట్రిబ్యునల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భూసేకరణ ఒడిశా ప్రభుత్వానిది.. పరిహారం ఆంధ్ర ప్రభుత్వం చెల్లించాలని... ఒడిశాకు 50 శాతం నీటిని అందించాలని నిర్ణయించింది. దీనితో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 2.5 లక్షల ఎకరాలకు ప్రయోజనం ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

ఇలా మొదలైంది..

- భామిని మండలం నేరడి సమీపంలో వద్ద బ్యారేజ్ నిర్మాణానికి 1962లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీజం పడింది. 1969లో పనులు ప్రారంభించారు. అనంతరం ఒడిశా అడ్డుపుల్ల వేయడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి ఏపీ ప్రభుత్వం హిరమండలం వద్ద గొట్టా బ్యారేజ్‌ను నిర్మించి... నదీ జలాలను సద్వినియోగం చేసింది.
- 1995లో నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ హిరమండలం వద్ద తాత్కాలికంగా శంకుస్థాపన చేశారు. అయితే అంతకముందే ఆయన ఒడిశా సీఎం బిజూ పట్నాయక్ నేరడి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. వంశధారలో లభ్యమవుతున్న 105 టీఎంసీల నీటిని సీడబ్ల్యూసీఈ నిబంధనల మేరకు చెరిసగం సద్వినియోగానికి రెండు ప్రభుత్వాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. కాగా తమ ప్రయోజనాలకు విఘాతం కలుగు తుందని ఒడిశా ప్రభుత్వం మరోసారి కోర్టును ఆశ్రయించి పనులను అడ్డుకుంది. నేరడి బ్యారేజ్ నిర్మాణం చేపడితేనే వంశధార జలాలు పూర్తి స్థాయిలో సద్వినియోగమవుతాయని ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో స్పష్టం చేశారు. అయినా కూడా ఒడిశా ప్రభుత్వం వినలేదు.
- వంశధార నదిలో 15 టీఎంసీల నీరు చేరితే దాన్ని మళ్లించేందుకు 2005లో కాట్రగడ్డ నుంచి హిరమండలం వరకు 30 కిలోమీటర్ల మేర వరదకాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం సుమారు రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. కొద్ది పనులు చేపట్టిన తర్వాత మళ్లీ ఒడిశా సర్కారు అడ్డంకులు సృష్టించింది.
- 2014 తర్వాత టీడీపీ ప్రభుత్వం దీనిపై కదలిక తీసుకొచ్చింది. వరద కాలువపై ట్రిబ్యునల్ ఏపీకి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఆగమేఘాలపై పనులు ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వం మరో రూ.800 కోట్లు అదనంగా ఇచ్చింది. 90 శాతం పనులు 2019 నాటికి పూర్తి చేశారు. ట్రయల్ రన్‌తో హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌కు ఎనిమిది టీఎంసీల నీరు తరలించారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం వరద కాలువ పనులు చేపట్టలేకపోయారు. బడ్జెట్‌లో రెండు పర్యాయాలు రూ.వంద కోట్లు కేటాయించినట్లు లెక్కలే మిగిలాయి.

నీటి కోసం కష్టాలు..



వంశధార వరద కాలువ ప్రారంభించడంతో తివ్వకొండపై నుంచి వస్తున్న సాగునీటి వనరులు, చెరువులు వరద కాలువ గర్భంలో కలిసిపోయాయి. బాలేరు, సొలికిరి సాగునీటి వనరులు పనికి రాకుండాపోయాయి. గత 18 ఏళ్లుగా నీటి కోసం మేం పడుతున్న బాధలు వర్ణనాతీతం. నేరడి బ్యారేజ్ నిర్మిస్తే పిల్ల కాలువల ద్వారా నీరందుతుంది.

-చలపతిరావు, సొలికిరి

వరద కాలువతో నరకం..



ముందు చూపు లేకుండా వరద కాలువ నిర్మాణంతో సాగు చేస్తున్న భూమిలోకి వెళ్లలేక... పండించిన పంటను తీసుకురాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాలువ దాటి వెళ్లేందుకు రైతుల కోసం సరైన సౌకర్యాలు కల్పించలేదు. కొత్త ప్రభుత్వమైనా దృష్టి పెట్టి వరద కాలువపై వంతెన నిర్మించి సహకరించాలి.

-గురుబిల్లి చెలమనాయుడు, రైతు, భామిని

బ్యారేజ్‌తో మేలు..

నేరడి బ్యారేజ్ పూర్తయితే వంశధార నది వరదనీటిని వరద కాలువలోకి మళ్లించి.. హిరమండలం జలాశయంలో నిల్వ చేయవచ్చు. వరదకాలువ పనులకు మరో రూ.30 కోట్లు అవసరం. ఇప్పటికే బ్యారేజ్ నిర్మాణానికి రూ.650 కోట్లు అవసరమని ప్రాథమిక అంచనా వేశాం.

-వాణీ శంకర్, వంశధార ప్రాజెక్టు డీఈ

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానం

- సెకండియర్‌లో 84 శాతం ఉత్తీర్ణత నమోదు



జిల్లా వృత్తి విద్యాధికారి మంజుల వీణను అభినందిస్తున్న జూనియర్ కళాశాల సిబ్బంది

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి)/: జియ్యమ్మవలస, జూన్ 18: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా వృత్తి విద్యాధికారిణి డి.మంజులవీణ తెలిపారు. జిల్లాలో 1,709 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,443 మంది ఉత్తీర్ణులలైనట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులను జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో విశేష కృషి చేసిన జిల్లా వృత్తివిద్యాధికారిణిని జిల్లా జూనియర్ కళాశాల సిబ్బంది అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వారికి నచ్చిన విత్తనాలను అందజేయండి
- సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తాం
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



రైతులకు వ్యవసాయ విత్తనాలను అందజేస్తున్న రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి


సాలూరు, జూన్ 18: రైతులు కోరుకొనే విత్తనాలను మాత్రమే వారికి ఇవ్వాలని, వారికి నచ్చని విత్తనాలను బలవంతంగా అప్పగించవద్దని రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. సాలూరు పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం 17వ విడత పీఎం కిసాన్ 17వ విడత నిధులు విడుదల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అలాగే, రైతులకు విత్తనాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిన రైతుల పక్షాన స్థానిక వ్యవసాయ కేంద్రం వద్ద తాను పోరాడినట్లు చెప్పారు. దీంతో తనతో పాటు 25 మంది రైతులపై అన్యాయంగా కేసులు పెట్టారని చెప్పారు. ఇప్పుడు ఆదే వ్యవసాయ కేంద్రంలో మంత్రిగా తనన ఆహ్వానించడంపై ఆనందం వ్యక్తం చేశారు. 'అన్నం పెడుతున్న రైతులక ఎప్పుడు అన్యాయం జరిగినా నేను పోరాడేందకు సిద్ధమే. రైతులు క్షేమంగా ఉండాలనేది మా నాయకుడు చంద్రబాబు నాయుడు లక్ష్యం. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఉండాలి. ఖరీఫ్‌లో సాగుకు నీరు అందించేందుకు రిజర్వాయర్లలో నీరు సిద్ధం ఉంది. కాలువల్లో పూడికలు తీయించాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. రైతులు ఎప్పుడు నీరు అడిగితే అప్పుడే ఇస్తాం. ఎలాంటి ముహూర్తాలు చూడటం ఉండదు. ఒక వేళ నేను అందుబాటులో లేకపోతే అధికారులతో నీటిని విడుదల చేస్తాం. రైతులతో పాటు ప్రజలకు ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి నాకు చెప్పవచ్చు. నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పురుగు మందుల షాపులను తనిఖీ చేయాలి.' అని మంత్రి తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనూరాధ, ఏడీ మధుసూధన్‌రావు, నాయకులు ముఖీ సూర్యనారాయణ, నిమ్మాది తిరుపతిరావు, పరమేష్, కేతిరెడ్డి చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం శిక్షణ

పార్వతీపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్య క్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ, ఎన్‌సీడీ ప్రాజెక్టు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింగరావు తెలిపారు. మంగళవారం జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలకు బ్యాచ్‌కు 50 మంది చొప్పున మూడు రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం నెల రోజులు కొనసాగుతుందన్నారు. నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ తదితర క్యాన్సర్లను స్క్రీనింగ్ చేయడం, పరిరక్షించడం, రిఫర్ చేయడం, ఫాలో అప్ చేయడం, ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించడం, వ్యసనాలు, జీవనశైలి, ఆహారపు అలవాట్లు ప్రభావం, నైపుణ్యంపై శిక్షణ ఇస్తారని వివరించారు.

1,13,865 మందికి పీఎం కిసాన్

- లబ్ధిదారుల ఖాతాలో రూ.22.77 కోట్లు జమ



పార్వతీపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందిస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ నిధులు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని 1,12,865 మంది రైతులకు లబ్ధి చేకూరింది. వీరి ఖాతాల్లో రూ.22.77కోట్లు జమయ్యే ప్రక్రియ ప్రారంభమైంది. సాలూరు మండలంలో 8,434 మందికి, పాచిపెంట మండలంలో 5,188 మందికి, మక్కువ 6,263, పార్వతీపురం 8,850, బలిజిపేట 9,656, సీతానగరం 9,949, వీరఘట్టం 9,059, పాలకొండ 8,078, భామిని 5,438, సీతంపేట 7,821, కొమరాడ 6,375, కురుపాం 6,725, గరుగుబిల్లి 8,037, గుమ్మలక్ష్మీపురం 6,210, జియమ్మవలస మండలంలో 7,782 మంది లబ్ధిదారులకు ప్రధానమంత్రి కిసాన్ పథకం ద్వారా నగదు జమ కానుంది. మొత్తం 1,13,865 మంది రైతులకు రూ.22.77కోట్లు అందనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు.

ఒక్కటి వచ్చుంటే ఒట్టు!



సీతానగరంలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీ

- జిల్లాలో పరిశ్రమల స్థాపనపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు పరుగులు పెడుతున్న జిల్లా యువత
- ఉన్నవి మూసేసిన వైనం ● కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఐదేళ్ల కాలంలో పారిశ్రామికంగా జిల్లాలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అప్పట్లో వైసీపీ పాలకులు ప్రగల్భాలు పలికారు. కానీ, అవన్నీ ఉత్తి మాటలగానే మిగిలిపోయాయి. అనువైన వాతావరణం, భూములు ఉన్నా ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదు. చిన్న పరిశ్రమలను చేయిపట్టుకు నడిపిస్తామని చెప్పిన జగన్.. ఆచరణలో ఘోరంగా విఫలయ్యారు. వాటికి కనీసం ప్రోత్సాహకాలు అందించలేదనే విమర్శలు నెలకొన్నాయి. కొత్త పరిశ్రమల సంగతి పక్కనే పెడితే గతంలో ఉన్న వాటిని మూసేశారు. దీంతో నిరుద్యోగులు ఉసూరుమంటున్నారు. చదువులు పూర్తయిన విద్యార్థులు ఉద్యోగ భయంతో వణికిపోతున్నారు. పరిశ్రమలు వచ్చి ఉంటే ఇక్కడే ఉపాధి అవకాశాలు దొరికేవని, కానీ, గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో స్థానికంగానే ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు..

జిల్లాలో ఏ పట్టణంలో చూసినా, గ్రామంలో చూసినా నిరుద్యోగులు వేలాది మంది ఉన్నారు. డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఈడీ, డీఈడీ, ఇంజనీరింగ్, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్‌తో పాటు వివిధ సాంకేతిక కోర్సుల్లో చదివి ఉత్తీర్ణత సాధించిన వారు అనేక మంది ఉన్నారు. అయితే, గత ప్రభుత్వం ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో నిరుద్యోగుల్లో చాలామంది ఇతర ప్రాంతాలకు జాబ్‌ల కోసం వెళ్లాల్సి వచ్చింది. జగన్ పాలనలో ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఏటా జాబ్ క్యాలెండర్ తీస్తామని చెప్పి మోసం చేశారు. డీఎస్సీ నిర్వహిస్తామని పట్టించు కోలేదు. ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా మరిచిపోయారు. స్కిల్, అన్‌స్కిల్ యువతకు ఉపాధి అవకాశాలు లేని పరిస్థితి జిల్లాలో ఉంది. నిరుద్యోగులుగా ఉండలేక ఉపాధి కోసం ఇతర జిల్లాలతో పాటు రాష్ట్రాలను దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాంకేతిక విద్య పూర్తిచేసిన వారు దూర ప్రాంతాలకు వెళ్లి నెలకు రూ.12వేల నుంచి రూ.15 వేల జీతానికి పనిచేయాల్సి వస్తుంది. ఇంజనీరింగ్ చదివిన వారు కూడా అదే జీతానికి పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం కోర్సులు పూర్తి చేసిన వారు ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేసేందుకు విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. డి-ఫార్మసీ, బి-ఫార్మసీ చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు లేక మెడికల్ షాపులు పెట్టుకుంటున్నారు. మెడికల్ షాపులు పెట్టుకొనే ఆర్థిక స్థోమత లేని తమ సర్టిఫికెట్లను ఇతరులకు అందించి నెలకు రూ.2వేల నుంచి రూ.3వేల తీసుకుంటున్న పరిస్థితి ఏర్పడింది.

కొత్తవి పెట్టలేదు.. పాతవి ఉంచలేదు

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని గతంలో వైసీపీ ప్రజాప్రతినిధులు జిల్లా ప్రజల్లో ఆశలు కల్పించారు. సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని, స్థలాన్ని కూడా ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ అవన్నీ ఉత్తి మాటలగానే మిగిలిపోయాయి. ఐదేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా నెలకొల్పలేకపోయారు. పైగా ఉన్న పరిశ్రమలను మూసివేశారు. జిల్లాలోని సీతానగరం మండలంలో ఉన్న చక్కెర కర్మాగారాన్ని గత సర్కారు మూసివేసింది. దీంతో ఆ కర్మాగారంలో పనిచేసిన వందలాది మంది కార్మికులతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందిన వారు రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంపైనే నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడు నిరుద్యోగ సమస్యను తీర్చడంతో పాటు ఉద్యోగ, ఉపాధి మార్గాలను చూపిస్తారని భావిస్తున్నారు.

దిక్సూచి
DIKSUCHI

వంద శాతం ఎంప్లాయిమెంట్ కల్పించే
ప్రింటింగ్ టెక్నాలజీ

పాలిటెక్నిక్ డిప్లొమాలు



డిప్లొమాలు కొన్ని ఎంప్లాయిమెంట్ కల్పించడంలో కల్పతరువులు అని చెప్పొచ్చు. అలాంటి వాటిలో ఒకటి ప్రింటింగ్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో మాత్రమే ఈ కోర్సు ఉంది. దీనిలో చేరడానికి పదో తరగతి పాసై తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే పాలిసెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. హైదరాబాద్‌లో జూ పార్క్‌కి సమీపంలోని కులి కుతుబ్‌షా (క్యూక్యూ) గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే ఈ కోర్సును అందిస్తున్నారు.

కోర్సు తీరు తెన్నులు: ఆధునిక ప్రపంచంలో ముద్రణ మాధ్యమానికి ఉన్న విస్తృత అవసరాల దృష్ట్యా ప్రింటింగ్ టెక్నాలజీ డిప్లొమాను మూడు సంవత్సరాల కోర్సుగా రూపొందించారు. అత్యాధునిక ముద్రణ సాంకేతిక విధానాలైన offset, gravure, flexography, screen, digital ప్రింటింగ్ గురించి బోధిస్తారు. ఈ కోర్సులో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి మూడు సంవత్సరాల్లో ఆరు సెమిస్టర్లు చదవాల్సి ఉంటుంది. మొదటి రెండు సెమిస్టర్లలో రెండు ప్రింటింగ్ సబ్జెక్టులు మినహాయిస్తే మిగిలిన సబ్జెక్టులన్నీ తతిమా అన్ని డిప్లొమాలతో సమానంగా ఉంటాయి. 3, 4, 5వ సెమిస్టర్లలో పూర్తిగా ప్రింటింగ్‌కు సంబంధించిన సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.

క్షేత్రస్థాయి అవగాహన: ఈ కోర్సు ద్వారా థియరీతోపాటు ప్రాక్టికల్స్‌లో కూడా మంచి పట్టు సాధించాల్సి ఉంటుంది. ప్రింటింగ్ టెక్నాలజీ చదువుతున్న విద్యార్థులను హైదరాబాద్‌లోని ప్రముఖ ముద్రణ సంస్థల్లో ఇండస్ట్రియల్ విజిట్‌కి తీసుకుని వెళతారు. తద్వారా పారిశ్రామిక స్థితిగతులను అవగాహన చేసుకునే అవకాశం కల్పిస్తారు. చివరి సెమిస్టర్‌లో ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుంది. ఈ ఆరు నెలల్లో విద్యార్థి ముద్రణ రంగంలోని అన్ని విభాగాలలో పనిచేసి సంబంధిత నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. తద్వారా యంత్రాలు నడపగలిగే స్థాయికి విద్యార్థి చేరుకుంటాడు. అంతే కాకుండా నిర్వహణ సామర్థ్యానికి సంబంధించిన నైపుణ్యాలు(మేనేజ్‌మెంట్ స్కిల్స్), ఆధునిక సాంకేతికత(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్), మార్కెటింగ్ నైపుణ్యాలు(మార్కెటింగ్ స్కిల్స్)లో తర్ఫీదు పొందుతాడు.

అభిరుచికి అనుగుణంగా: ఈ కోర్సు చదివిన విద్యార్థి ముద్రణ పరిశ్రమలోని ముఖ్యమైన నాలుగు విభాగాలు ప్రి ప్రెస్, ప్రెస్ వర్క్, పోస్ట్ ప్రెస్, మార్కెటింగ్‌లలో వారి వారి ఆసక్తులను బట్టి ఎంచుకునేందుకు, సదరు విభాగాల్లో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

- ప్రి ప్రెస్ విభాగాన్ని డి.టి.పి & డిజైనింగ్‌లో ఆసక్తి, నైపుణ్యం ఉన్నవారు ఎంపిక చేసుకుంటారు. ప్రెస్-వర్క్ విభాగంలో యంత్ర నిర్వాహకుడిగా, పర్యవేక్షకుడిగా పెద్ద స్థాయుల్లో అవకాశాలుంటాయి. ప్రింట్ ఫినిషింగ్‌లో బైండింగ్, ప్యాకింగ్‌పై ఆసక్తి ఉన్నవారుంటారు. మార్కెటింగ్ విభాగంలో సరైన నిర్ణయాలు, అంచనా వేయగలిగిన వారు, వినియోగదారులతో వ్యాపార సంబంధాలను నెరపగలిగిన వారుంటారు.

ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు: రిజర్వ్ బ్యాంక్ కరెన్సీ ప్రెస్‌లో ఉద్యోగం పొందాలంటే డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ తప్పనిసరి. ఈ కోర్సు చేసిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎంతో మంది ప్రభుత్వ రంగ సంస్థలు మింటింగ్, భారతీయ రిజర్వు బ్యాంకు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయాలు అలాగే ప్రైవేటు రంగంలో వివిధ ముద్రణ సంస్థల్లోనూ, పత్రికారంగంలోనూ ఉన్నత స్థాయిలో ఉన్నారు. ప్రింటింగ్ టెక్నాలజీ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ప్రింటింగ్ పరిశ్రమలలో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అనుభవం గడించిన తరవాత కొందరు సొంతగా ప్రింటింగ్ ప్రెస్‌లు స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్: క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఏటా క్రమం తప్పకుండా జరుగుతుంది. అందరూ దాదాపుగా ఏదో ఒక దగ్గర ఉద్యోగం పొందుతారు. కొద్ది సంవత్సరాలుగా విద్యార్థినుల సంఖ్య పెరుగుతోంది. ప్రింటింగ్ డిప్లొమా చేసే విద్యార్థినులు ఎక్కువగా డిజైన్, పోస్ట్ ప్రెస్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలను ఎంచుకుంటుంటారు.

ఉన్నత విద్యావకాశాలు: ఈ డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించి లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రింటింగ్ టెక్నాలజీలో మాత్రమే కాకుండా మెకానికల్, కంప్యూటర్స్, ఐ.టి., ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లలో కూడా బీటెక్ చదివే అవకాశం ఉంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం ద్వారా 40 శాతం విద్యార్థులు ఉన్నత విద్యను పొందగలుగుతున్నారు.

SCHOLARSHIP ALERT

Legrand Empowering Scholarship Program 2024-25



Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

Last Date to Apply: 15-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities

Description: An initiative of Aadhar Housing Finance Limited (AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5- 3 lakh are eligible to apply.

Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000

Last Date to Apply: 23-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/AKSP1

Raman Kant Munjal Scholarships

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible. Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. The annual family income of the applicants should be less than INR 4 lakh. Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 02-08-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/RMKSP4

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/dIPEIGGలో చదవండి.

buddy4study.com



థాయ్‌లాండ్ వెళుతున్న దేవర

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దేవర' మీదే ప్రస్తుతం అందరి దృష్టీ ఉంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న తారక్ సినిమా కావడంతో ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటిస్తున్న తొలి తెలుగు చిత్రం ఇదే కావడం మరో ముఖ్య కారణం. దర్శకుడు కొరటాల శివ ఓ అద్భుత చిత్రంగా 'దేవర'ను తీర్చిదిద్దుతున్నారు. ఇటీవలే గోవాలో ఎన్టీఆర్, సైఫ్ అలీఖాన్ మీద ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. గోవాలో భారీ వర్షం కురుస్తున్నా వెనుకడుగు వేయకుండా, రాజీ పడకుండా ఈ ఫైట్ చిత్రీకరించడం గమనార్హం. త్వరలో థాయ్‌లాండ్‌లో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ మీద ఓ మెలోడియస్ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న 'దేవర' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది.



గిలాసే ఎత్తేస్తే కులాసే

ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా హిట్‌ను అందుకున్న కె. నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అశ్విన్ రామ్ దర్శకుడు. ఇటీవలే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు చక్కటి ఆదరణ దక్కింది. ఇప్పుడు ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ను యూనిట్ ప్రారంభించింది. 'డార్లింగ్' నుంచి తొలి గీతం 'ఖలాసే ఖాలాసే మామా నా బతుకే ఖలాసే.. గిలాసే ఎత్తేస్తే కులాసే'ను మంగళవారం విడుదల చేసింది. సామాన్యుడి బాధలను ఏకరువు పెడుతూ సాగే ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, వివేక్ సాగర్ స్వరాలు సమకూర్చారు. హనుమాన్ సీహెచ్, రామ్ మిరియాల ఆలపించారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణ తేజ్, అనన్య నాగళ్ల కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నరేశ్ రామదురై, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ్,

ఆ ప్రశ్నలకు సమాధానం కల్కి



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ సైన్స్ ఫిక్షన్ ఎపిక్ 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న విడుదల కానుంది. వైజయంతీ మూవీస్ సంస్థ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ విజువల్ వండర్ రోజురోజుకీ అంచనాలు పెంచుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా 'ఎపిక్ జర్నీ వన్.. ది ప్రిల్యూడ్ ఆఫ్ కల్కి 2898 ఏడీ'ని మంగళవారం విడుదల చేశారు. ఈ వీడియోలో దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కలియుగంలో ఏం జరుగుతుంది, ఏం జరగవచ్చు.. ఇలాంటి ప్రశ్నలకు 'కల్కి' క్లైమాక్స్ సమాధానం. కేవలం ఇండియాలోనే కాదు ప్రపంచంలో ఉన్న వారందరికీ సంబంధించిన కథ ఇది. నాకు చిన్నప్పటి నుంచి పౌరాణిక చిత్రాలు అంటే ఇష్టం. అలాగే హాలీవుడ్‌లో వచ్చిన 'స్టార్ వార్స్' వంటి సినిమాలు కూడా నన్ను ఆకట్టుకున్నాయి. అయితే ఇలాంటి సినిమాలను అక్కడే తీయాలా, మనం తీయలేమా అనిపించేది. మహాభారతంలో ఎన్నో గొప్ప పాత్రలు ఉన్నాయి. కృష్ణ నిర్యాణంతో కలియుగం ప్రారంభమైనప్పుడు ఏం జరుగుతుంది అనే సృజనాత్మక ఊహతో రాసుకున్న కథ ఇది. మనం చదివిన పురాణాలు, ఎపిక్స్.. అన్నింటికీ ఈ సినిమా క్లైమాక్స్‌లా ఉంటుంది. ఒక యుగంలో రావణుడు, మరో యుగంలో దుర్యోధనుడు.. ఇలా అన్నింటిలోంచి ఓ రూపం తీసుకుని దాంతో పోరాటం ఎలా ఉంటుందన్న ఐడియాతో 'కల్కి' కథ రాయడానికి ఐదేళ్లు పట్టింది. సరికొత్తగా రూపుదిద్దుకున్న ఈ సైన్స్ ఫిక్షన్ మైథాలజీని చూసి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటాని, రాజేంద్రప్రసాద్ తదితరులు ఈ చిత్రంలో నటించారు.

త్వరలోనే మీ ముందుకొస్తా



ప్రఖ్యాత గాయని, జాతీయ అవార్డు గ్రహీత అల్కా యాగ్నిక్ ఓ అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. దీని గురించి ఆమె వివరణ ఇస్తూ "కొన్నాళ్లుగా నువ్వు కనిపించడం లేదు ఎందుకని మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అడుగుతున్నారు. ఈ గ్యాప్‌కు కారణం.. నేను ఓ అరుదైన వినికిడి సమస్యతో బాధపడుతున్నాను. చెవికి సోకిన ఓ వైరస్ వల్ల ఏర్పడిన ఈ వినికిడి సమస్యను చికిత్సతో నయం చేయవచ్చనే భరోసాను డాక్టర్లు ఇచ్చారు. మీరు కూడా చింతించొద్దు.. ఆందోళన చెందవద్దు. త్వరలోనే నా వినికిడి శక్తిని తిరిగి పొంది.. మీ ముందుకు ఫుల్ జోష్‌తో వస్తాను. మీరు కూడా వీలైతే పెద్ద శబ్దాల నుంచి దూరంగా ఉండండి. హెడ్‌సెట్ ధరించి ఎక్కువ సౌండ్‌తో పాటలు వినడం తగ్గించండి" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

కొత్తదనంతో నిండిన చిత్రం



'హ్యాపీడేస్', 'కొత్త బంగారులోకం'తో లవర్ బాయ్, పక్కింటి కుర్రాడి ఇమేజ్ సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. తనకున్న ఆ ఇమేజ్‌కి భిన్నంగా ఆయన పూర్తి సీరియస్ రోల్‌లో నటించిన చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అనేది ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. "నేనిప్పటివరకూ ఇటువంటి పాత్రను చేయలేదు. నిజజీవితంలో ఎంతో చలాకీగా, నవ్వుతూ కనిపించే నేను.. ఇందులో చాలా సీరియస్‌గా ఉంటాను. ఒక నటుడిగా నన్ను కొత్తగా ఆవిష్కరించిన చిత్రమిది. రొటీన్‌కు భిన్నంగా సినిమాలు చేద్దామనుకొంటున్న సమయంలో ఈ కథ విన్నా. చాలా నచ్చింది. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా 'నింద' సినిమా కథను చాలా పకడ్బందీగా రాసుకున్నారు డైరెక్టర్ రాజేశ్ జగన్నాథం. సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్‌లలో చాలా కథలు వచ్చాయి. కానీ వాటన్నింకంటే పూర్తి భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. కొత్తదనంతో నిండిన ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. తరువాతి సన్నివేశంలో ఏం జరుగుతుందనేది ఎవరూ ఊహించలేరు" అని చెప్పారు.



టైటిల్ లోగో ఆవిష్కరించిన తేజ

దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం టైటిల్ లోగోని దర్శకుడు తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాకైనా ప్రేక్షకుల్ని ఆకర్షించేది, వారిని థియేటర్ దగ్గరకు నడిచేలా చేసేది టైటిల్ మాత్రమే. 'పోలీస్ వారి హెచ్చరిక' శక్తిమంతమైన మాస్ టైటిల్. నిర్మాతకు విజయం చేకూరాలి' అన్నారు. 'రెండు తెలుగు రాష్ట్రాల్లో షూటింగ్ పూర్తి చేశామనీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ నిర్మాత బెల్లి జనార్ధన్, దర్శకుడు బాబ్జీ చెప్పారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, శుభలేఖ సుధాకర్, షియాజీ షిండే, హిమజ, జయవాహినీ, తులసి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: గజ్వేల్ వేణు, ఫొటోగ్రఫీ: నళినీకాంత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్.పి. సుబ్బారాయుడు.

ప్రియురాలిని పెళ్లాడుతున్న సిద్ధార్థ్ మాల్యా



వ్యాపారవేత్త విజయ్ మాల్యా తనయుడు, నటుడు సిద్ధార్థ్ మాల్యా పెళ్లి పీటలు ఎక్కనున్నారు. తన ప్రియురాలు జాస్మిన్‌ను సిద్ధార్థ్ లండన్‌లో బంధుమిత్రుల సమక్షంలో పెళ్లాడనున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతాలో వారిద్దరూ కలసి తెల్లకోటు, తెల్ల గౌను వేసుకుని పెళ్లి దుస్తుల్లో ముస్తాబైన ఓ ఫొటోను పోస్ట్ చేసి "పెళ్లికి సమయం ఆసన్నమైంది. వేడుకలు మొదలయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. జాస్మిన్‌కు గతేడాది నవంబరులో తన ప్రేమను వ్యక్తపరిచిన సందర్భాన్ని.. ఇద్దరూ కలసి నిశ్చితార్థపు ఉంగరాన్ని ధరించిన ఫొటోలను సిద్ధార్థ్ మాల్యా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. దీంతో వీరిద్దరి ప్రేమాయణం గురించి అందరికీ తెలిసింది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/x2HehXX లో చదవండి.

మాజీ వలంటీర్ల వేడుకోలు

- బలవంతంగా రాజీనామా చేయించారంటూ ఆవేదన
- విధుల్లోకి తిరిగి తీసుకోండంటూ వినతులు

బొబ్బిలి: అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ ఆడిన విన్యాసంలో పాపం వలంటీర్లు బలైపోయారు. వైసీపీ నాయకులు చేసిన ఒత్తిడి, బెదిరింపులకు లోనై ఎన్నికల సమయంలో జిల్లా వ్యాప్తంగా అనేక మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మళ్లీ అధికారంలోకి మనమే వస్తామని, మీ అందరికీ మళ్లీ బాధ్యతలు అప్పగిస్తామని, ఈ లోగా వలంటీరు పోస్టులకు రాజీనామాలు చేసి నిర్భయంగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో సేవలు అందించి తరించండి అని చెప్పడంతో కొంతమంది రాజీనామాలు చేసేశారు. ఎన్నికల్లో వైసీపీ చోటా నాయకులు, పెద్ద నాయకులు చెప్పిన పనులన్నీ ఆ పార్టీకి చేసిపెట్టారు. ● తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వలంటీర్లను కొనసాగిస్తామని, నెలవారీ గౌరవవేతనాన్ని ఐదువేల నుంచి పదివేల రూపాయలకు పెంచుతామని, బాధ్యతాయుతమైన పనులు అప్పగిస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఎన్‌డీఏ నేతలు చంద్రబాబు-పవన్‌కల్యాణ్ ఇద్దరూ వ లంటీర్ల భవిష్యత్ గురించి గట్టి భరోసా ఇచ్చినప్పటికీ వైసీపీ నాయకులు వలంటీర్లను మభ్యపెట్టి, వారి మెడపై కత్తి పెట్టి మరీ రాజీనామాలు చే యించారు. వారి మాటలు నమ్మి కొంతమంది వలంటీర్లు తటస్థంగా ఉండి పోగా, మరికొంతమంది రెచ్చిపోయి మరీ వైసీపీ తరపున ప్రచారబాధ్య తలు నిర్వహించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రావడంతో అత్యుత్సాహం చూపినవారంతా భంగపడినట్లయింది. వలంటీరు పోస్టులను కోల్పోయిన వారంతా మా సంగతేంటి అంటూ లబోదిబో మంటున్నారు.

జిల్లాకు చెందిన నూతన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు, స్థానిక ఎమ్మె ల్యే బేబీనాయనకు, ఎంపీడీవో రవికుమార్‌కు రాజీనామాలు చేసిన వలంటీర్లంతా వినతిపత్రాలు అందిస్తున్నారు. అధికారంలో ఉన్న వైసీపీ నాయకు లు బెదిరింపులు, తీవ్రమైన ఒత్తిళ్ల కారణంగా మేమంతా బలవం తం గా రాజీనామాలు చేశామని, మాకు తిరిగి బాధ్యతలను అప్పగించాలని వే డుకుంటున్నారు. నామమాత్రపు గౌరవవేతనంతో 2019 నుంచి 2024 ఏప్రి ల్ వరకు విశిష్టమైన సేవలందించామని, ముఖ్యంగా కోవిడ్ సమ యంలో ప్రాణాలకు తెగించి మరీ సేవలందించినట్లు వలంటీర్లు చెబుతు న్నారు.

బొబ్బిలి మండలంలో 22 గ్రామసచివాలయాల పరిధిలో మొ త్తం 357 మంది వలంటీర్లను నియమించగా అందులో 279 మంది ఎన్నికల సమయంలో వైసీపీ ఒత్తిళ్లకు లోనై రాజీనామాలు చేశారు. బొబ్బిలి మున్సిపా లిటీ పరిధిలో 16 సచివాలయాల పరిధిలో మొత్తం 331 మంది వలంటీర్లకు గాను 220 మంది రాజీనామాలు చేశారు. 110 మంది మాత్రమే పనిచేస్తున్నారు. బాడంగి మండలంలో 18 సచివాలయా లలో 350 మంది వలంటీర్లకు 332 మంది రాజీనామా చేశారు. రామభద్రపురం మండలంలో 17 సచివాలయాల్లో 294 మంది వాలంటీర్ల కు గాను 210 మంది రాజీనామా చేశారు. తెర్లాం మండలంలోని 21 సచి వాలయాల పరిధిలో 336 మంది వలంటీర్లలో 270 మంది రాజీనామా చేశారు.

బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన 25 మంది వలంటీర్లు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గౌరవవేతనం పెంచుతున్న నేపథ్యంలో తాము వాటిని పొందలేకపోవడం చాలా బాధాకరమని, తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు.

రాజాం: వైసీపీ నాయుకులు మమ్మలను బలవంతగా వాలంటీర్లుగా రాజీనామా చేయించారు అందుకు మరలా విధుల్లోకి తీసుకోవాలని రాజాం పురపాలక సంఘం పరిధిలోని వలంటీర్లు కమీషనర్ జె రామప్పలనాయుడుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. రూరల్ మండలం పరిధిలోని పలు గ్రామాల నుంచి వలంటీర్లు ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయం పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.


వినతిపత్రం ఇస్తున్న బొబ్బిలి మండలం వలంటీర్లు


రాజాం: కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న వలంటీర్లు

వైసీపీని అంటకాగినవారికి చాన్స్ ఇవ్వొద్దు

వైసీపీకి అంటకాగుతూ అంతా తామే అన్నట్లుగా వ్యవహరించిన వలంటీర్లను ఎట్టిపరిస్థితుల్లో తిరిగి చేర్చుకోవద్దు. అలాంటి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం సమంజసం కాదు. నిజాయితీగా సేవ లందించిన వారికి అన్యాయం జరగకూడదు.

-కాకల వెంకటరావు, టీడీపీ ఎస్సీ విభాగం నేత, బొబ్బిలి

ప్రస్తుతం ఉన్న వారితోనే పెన్షన్ల పంపిణీ

రాజీనామాలు చేయగా మిగిలిఉన్న వలంటీర్లతో సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియ జరుగుతుంది. ఈ మేరకు ఆదేశాలు వచ్చాయి. రాజీనామాలు చేసిన వలంటీర్ల వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. వారి ఆదేశాల మేరకు వలంటీర్ల విషయంలో తదుపరి చర్యలు తీసుకుంటాం.

- రవికుమార్, ఎంపీడీవో, బొబ్బిలి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- ఆగి ఉన్న మినీ వ్యానును ఢీకొన్న యాత్రికుల బస్సు
- మృతులు ఇద్దరూ విశాఖ జిల్లా వాసులు


ఘటనా స్థలంలో నుజ్జయిన వాహనం, పరిశీస్తున్న పోలీసులు

పూసపాటిరేగ, జూన్ 18: ఆగి ఉన్న వ్యాన్‌ను బస్సు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం నుంచి లోడ్‌తో ఓ మినీవ్యాన్ శ్రీకాకుళం వైపు వస్తుంది. మంగళవారం సాయంత్రం వాహనం టైర్ పంక్చర్ కావడంతో పాతకొప్పెర్ల వద్ద జాతీయరహదారి పక్కన ఆపి వాహనం డ్రైవర్ సాడి రమణ(50), తోనంగి నరశింహ(46) వాహనంలో కూర్చున్నారు. అదే సమయంలో అదే దిశగా వస్తున్న ఓ యాత్రికుల బస్సు అతివేగంతో వచ్చి బొలెరో వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో మినీవ్యాన్‌లో ఉన్న నరసింహ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రమణను చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులిద్దరూ విశాఖ జిల్లా ఆనందపురం మండలం, వల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందివారుగా పోలీసులు గుర్తించారు. సంఘటన జరిగిన వెంటనే స్థానిక ఎస్ఐ సన్యాశినాయుడితో పాటు పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని దర్యాప్తు నిర్వహించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పూసపాటిరేగ, జూన్ 18: చింతపల్లి బీచ్‌లో సోమవారం పశ్చిమబెంగాల్‌కు చెందిన అబ్దుల్ కళాం మల్లిక్(25) మిత్రులతో కలిసి స్నానానికి వెళ్లగా సముద్రంలో గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు, స్థానికులు సోమవారం గాలింపు చర్యలు చేపట్టినా ఎటువంటి ఆచూకీ దొరకలేదు. మంగళవారం ఉదయం అతని మృతదేహం చింతపల్లి బీచ్‌లో కొట్టుకురావడంతో స్థానిక మత్యకారులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో మృతదేహాన్ని గుర్తించి కేసును నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయలు

రాజాం రూరల్ : రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడిన ఘటన మండలంవలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం మండలం బొద్దాం గ్రామానికి తులసి తన కుమారుడితో ద్విచక్ర వాహనంపై రాజాం వస్తుండగా పెనుబాక గ్రామ జంక్షన్ వద్ద ఆవు అడ్డంగా వచ్చి దాడి చేయడంతో ద్విచక్ర వాహనం బోల్తాపడింది. దీంతో తులసి తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 వాహనంలో రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విష మం కావడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏజెన్సీలో మలేరియా నియంత్రణపై చర్యలు

సీతంపేట: ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా జ్వరాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నామని ఆ శాఖ జోనల్ అధికారి డా.శాంతి ప్రభ తెలిపారు. మండ లంలో ఇటీవల అధికంగా మలేరియా కేసులు నమోదవుతున్న దృష్ట్యా గుమ్మడ, సీతంపేట ఏరియా ఆసుపత్రి, కుశిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో ఉన్న 15 మండలాల్లో ఈ ఏడాది 401 మలేరియా ప్రభావిత గ్రామాల్లో గత నెల 15వ తేదీ నుంచి మొదటి విడత దోమల నివారణ మందు పిచికారీ ఒక ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 333 గ్రామాల్లో ఏపీఎం ఐదు శాతం రసాయనాన్ని పిచికారీ చేశామన్నారు. జిల్లాలో గత ఏడాది 400లకు పైగా మలేరియా, 200లకు పైగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయని ఆమె తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 264 మలేరియా, 14 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని, వీరందరికీ చికిత్స అందించామని చెప్పారు. జిల్లాలో రెండు ఎస్ఎస్‌హెచ్ కేంద్రాలున్నాయని, ఒకటి జిల్లా ఆసుపత్రి పార్వతీపురం, ఇంకొకటి ప్రాంతీయ ఆసుపత్రి పాలకొండలో ఏర్పాటు చేశారని చెప్పారు. సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహన్‌రావు, తిరుపతిరావు, రామచంద్రరావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం దాసన్నపేట: మున్సిపల్ ఇంజినీరింగు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు వెంకటరెడ్డి, ఎన్‌వై నాయుడు, పి.శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో ఇంజినీరింగు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఇంజినీరింగు కార్మికులకు బేసిక్ వేతనం డీఏతో కలిపి రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు రాజు, ఆదినారాయణ, మురళీ, నారాయణరావు, రఘు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

విజయనగరం దాసన్నపేట: పెదమానాపురం పశువుల సంతకు నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సు మంజూరుకు తీర్మానంపై సంతకం చేసిన గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జి.చంద్రమౌళిని సస్పెండ్ చేయాలని ఏపీ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

న్యాయవాదుల హర్షం

శృంగవరపుకోట: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టాన్ని ఈ ప్రభుత్వం రద్దు చేయడంపై శృంగవరపుకోట న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం న్యాయవాదుల సంఘం సమావేశమైంది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. న్యాయవాదుల పోరాటానికి ఫలితం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. న్యాయమూర్తి సబ్బవరపు వాణికి పుష్పగుచ్ఛం అందించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బి.సత్యనారాయణలు, న్యాయవాదులు గేదల ప్రకాష్, బి.త్రిమూర్తులు, డబ్ల్యూఎస్ శర్మ తదితరులు వున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి 50 వేల ఆర్థికసాయం

లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన దాఖరపు గ్రీష్మ అనే ఇంజినీరింగ్ విద్యార్థినికి చదువు నిమిత్తం ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు రూ.50వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. గ్రీష్మ తండ్రి దేముడునాయుడు టీడీపీ సీనియర్ కార్యకర్త. గత ఏడాది అనారోగ్యంతో మరణించడంతో ఆ కుటుంబాన్ని లలితకుమారి దంపతులు దత్తత తీసుకున్నారు. పాప చదువులకు అయ్యే మొత్తం ఖర్చు ఎమ్మెల్యే భరిస్తున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

విజయనగరం రింగురోడ్డు : ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 18 అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే సిబ్బంది పట్ల ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనేల ధనలక్ష్మీ, పిన్నింటి కళావతి, క మిషనర్ ఎం మల్లయ్యానాయుడు, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.కోటలో దోమల మందు పిచికారీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట పెద్ద వీధిలో మంగళవారం కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది దోమల పిచికారి చేశారు. సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు ఈ పిచికారి చేస్తున్నట్లు ఆరోగ్య పర్యవేక్షకులు రామసత్యం, ఆరోగ్య కార్యకర్తలు శంకర్, రామకృష్ణ, ప్రభావతి తెలిపారు. వార్డు సభ్యులు శేషగిరిరావు ఉన్నారు.

అన్న క్యాంటీన్‌కు మరమ్మతులు చేపడతాం

బొబ్బిలి: స్థానిక అన్న క్యాంటీన్‌కు వారం రోజుల్లోగా మరమ్మతు పనులు పూర్తి చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. క్యాంటీన్ భవనానికి ఐదులక్షల రూపాయలతో ప్రతిపాదనలు పంపామని, రూఫింగ్, శానిటేషన్ తదితర పనులు చేయించాల్సి ఉందన్నారు. గతంలో ఈ క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన ఫర్నీచర్ ఇతర సామగ్రి గల్లంతు అయినట్లు భావించామని, మున్సిపల్ కార్యాలయంలోనే వినియోగిస్తున్నారని ఆమె తెలిపారు. వాటిని గుర్తించి అక్కడికి తిరిగి చేర్చుతామన్నారు. మరమ్మతు నిధులను ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే పనులు పూర్తి చేస్తామని కమిషనరు తెలిపారు.

రుణాల రికవరీ వేగవంతం చేయాలి

రామభద్రపురం: మండలంలో డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన రుణాలు రికవరీ చేయడంలో ఎంఎస్‌లు బాధ్యతగా పనిచేయాలని వెలుగు ఏపీఎం రత్నకుమార్ తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో మంగళవారం ఎంఎస్‌లతో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన శ్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాల రికవరీపై దృష్టిసారించాలని కోరారు. అలాగే గ్రామ స్థాయిలో ఉన్న ఆడిట్‌లు పూర్తిచేయాలని, బుక్ కీపింగ్‌లు అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన శ్రీనిధి కొత్తగా రుణాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈసమావేశంలో సీసీ బాలకృష్ణ, వివిధ గ్రామాల ఎంఎస్‌లు పాల్గొన్నారు.


నేటి నుంచి ఉచిత బ్రెస్ట్ స్క్రీనింగ్ పరీక్షలు

విజయనగరం రింగురోడ్డు: ప్రాజెక్టు మలార్, రోటరీ మెయిన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా బ్రెస్ట్ స్క్రీనింగ్ (రొమ్ము తనిఖీ) పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ తిరుమల ప్రసాద్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 19న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకూ ఉచితంగా బ్రెస్ట్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 15 నుంచి 25 ఏళ్ల యువతులు, ఆ వయస్సు పై బడిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స.హ చట్టాన్ని అమలు చేయాలి

విజయనగరం దాసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి విజయనగరం జిల్లా శాఖ కన్వీనరు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం కోట జంక్షన్‌లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి నెలలో ఏదో ఒక రోజు సమాచార శాఖ కమిషనర్లు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాలు జరిపి సమాచారం అడిగిన వారికి పక్కాగా సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వైభవంగా శివ కల్యాణం



లక్కవరపుకోట: మండలంలో కల్లేపల్లి గ్రామంలో సోమవారం రాత్రి శివకల్యాణం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, పురోహితులు, ఆలయ కమిటీ దంపతులచే కల్యాణ ఘట్టాన్ని దగ్గరుండి జరిపించారు. ఆలయ పూజారి దొందుకుర్తి ధనం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమకంలో మంధా రాజకుమార్, ఎస్.శ్రీకాంత్, వడ్లమాని శ్రీనివాసరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌ను కలిసిన కేంద్ర మంత్రి


అశోక్‌తో చర్చిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విజయనగరం, జూన్ 18: కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతి రాజును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నా యుడు మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖలో ఉన్న అశోక్‌ను మంగళవారం కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. మంచి మంత్రిత్వ శాఖ ఇచ్చారని బాగా పనిచేసి పేరు తీసుకురావాలని రామ్మోహన్‌నాయుడును కోరారు. విమానయాన రంగంపై అశోక్ తన అనుభవాలను వివరించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పనాయుడు కూడా అశోక్‌ను కలిశారు.

రైతుల సమస్యలపై బేబీనాయన ఆరా


తెర్లాం: తోటపల్లి పిల్లకాలువను పరిశీలిస్తున్న బేబీనాయన

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామంలో రైతుల సమస్యలను ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం అడిగి తెలుసుకున్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఆయన గ్రామంలో పర్యటించారు. కల్వర్టులు పాడైపోవడంతో సాగునీటికి, నాటుబళ్లు, ట్రాక్టర్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో తమకు అసౌకర్యంగా ఉన్నందున వెంటనే ఈ పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయించాలని వారు కోరారు. తోటపల్లి కాలువ వద్ద మూడు, గ్రామ బస్టాపు దగ్గర ఒకటి చొప్పున కల్వర్టులు నిర్మించాలని రైతులు కోరారు. ఇందుకోసం సుమారు 25 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని అంచనా. అవసరమైన ఎస్టిమేషన్లను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఆర్‌అండ్‌బీ వర్క్స్ ఇన్‌స్పెక్టరు ధర్మారావును ఎమ్మెల్యే ఆదేశించారు. అంతవరకు తాత్కాలిక చర్యల కోసం ఏర్పాట్లు చేస్తామని బేబీనాయన హామీ ఇచ్చారు.

● **తెర్లాం:** తోటపల్లి పిల్ల కాలువ మంగళవారం బేబీనాయన పరిశీలించారు. గండికొట్టిన ప్రాంతానికి వెళ్లారు. గత ప్రభుత్వం నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అప్పటి నాయకులు పట్టించుకోలేదన్నారు. వెంటనే దీనిపై నివేదిక ఇవ్వాలని తోటపల్లి ఇరిగేషన్ డీఈ నవీన్‌ను ఆదేశించారు.

కారాడ గ్రామానికి గుర్తింపు

- రసాయన రహిత ఎరువుల వినియోగంపై ప్రశంస


రసాయనరహిత ఎరువుపై ఇచ్చిన సర్టిఫికెట్


కారాడలో రసాయన రహిత ఎరువును తయారుచేస్తున్న రైతులు

బొబ్బిలి, జూన్ 18: రసాయన రహిత ఎరువులు, క్రిమి సంహారకమందుల వినియోగంలో బొబ్బిలి మండలం కారాడ రైతులు ముందంజలో ఉన్నారు. తద్వారా జిల్లాలోనే అరుదైన గుర్తింపును అందుకున్నారు. మూడు, నాలుగేళ్ల నుంచి ఈ ప్రాంత రైతులు డీ కంపోజర్ (పంట వ్యర్థాల నుంచి కంపోస్టు) ను ఉపయోగించి పంటల సాగు చేసుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. రసాయన ఎరువుల జోలికి పోకుండా భూసంజీవనిలా సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు. ఇందుకు గాను ఇండియా గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (ఇండ్ జి ఏపీ) సర్టిఫికేషన్ స్కీములో బొబ్బిలి మండలం కారాడ ఎంపికైంది. ప్రతీ ఖరీఫ్ సీజన్‌లో వందమంది రైతులను ఎంపిక చేసి వారితో ఈ విధానం ద్వారా పంటల సాగు చేస్తున్నారు. కారాడ గ్రామంలో 18 మంది రైతులు నాలుగేళ్ల నుంచి ఈ తరహా పంటలసాగు చేస్తూ అదర్శంగా నిలుస్తున్నారు. అలజంగి, గోపాలరాయుడిపేట రైతులు కూడా ఈ విధానాన్ని పాటిస్తున్నారు.

ప్రజలతో బాధ్యతగా మెలగాలి: అదితి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్: ప్రజలు, వారి సమస్యల విషయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా మెలగాలని, మంచి సేవకులుగా పేరు తెచ్చుకోవాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండనక, వానఅనక, రాత్రినక, పగలనక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి, విజయానికి సహకరించారన్నారు. పేరు, పేరున ఆమె ధన్యవాదాలు తెలిపారు.. గ్రామం, డివిజన్ యూనిట్‌గా సమస్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో వుండాలన్నారు. సమస్యలపై ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, పిళ్లా విజయ్‌కుమార్, కాళ్ల గౌరీశంకర్‌తో పాటు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచి రోజులు: కోళ్ల


ములగవాకవానిపాలెం గ్రామంలో కోళ్ల లలితకుమారి

కొత్తవలస, జూన్ 18: రాష్ట్రానికి, నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం మండలంలోని వీరభద్రపురం పంచాయతీ ములగవాకవానిపాలెం గ్రామానికి చెందిన పరదేశమ్మవారిని ఆమెదర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఈమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. నాయకులు కేబీఏ రాంప్రసాద్, కోళ్ల వెంకటరమణ, లెంకశ్రీను, సాగర్‌కల్యాణ్, లాలం అర్జునరావు, బంగారు ఇమేష్, గొంపదుర్గా ఉమేష్, కొరుపోలు అప్పారావు, నక్కరాజు చినరాము, పీఈ రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మంగళవారం రాత్రి విశాఖపట్టణంలో శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.

దర్గాను సందర్శించిన మంత్రి శ్రీనివాస్


బాబాని దర్శించుకున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం దాసన్నపేట, జూన్ 18: జిల్లా కేంద్రంలోని సూఫీ పుణ్యక్షేత్రం బాబామెట్ట హజరత్ సయ్యద్ ఖాదర్‌వలీ దర్గాను రాష్ట్ర సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సోమవారం రాత్రి సందర్శించారు. ఖాదర్‌వలీ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ధర్మకర్త డాక్టరు ఖలీల్‌బాబా మంత్రి శ్రీనివాస్‌కి సాదర స్వాగతం పలికారు. సుగంధ ద్రవ్యాలతో ఖాదర్ షా దివ్య సమాధికి మంత్రి శ్రీనివాస్ చాదర్ సమర్పించారు.

విజయనగరం రింగురోడ్డు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఐఎంఏ ప్రతిని ధులు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు మంగళవారం ఆయన ఇంటివద్ద కలి శారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జెసీ నాయుడు ఆయనను సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు.

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని మంగళవారం ఆయన నివాసంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరరావు (ఎన్ఈఆర్), పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి కలిశారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు ఉప్పలపాటి రాజేష్‌వర్మ, పిళ్లా నవిన్‌కుమార్ ఉన్నారు.

సాగునీటికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్‌లు

గరుగుబిల్లి, జూన్ 18: ఖరీఫ్‌కు సంబంధించి సాగునీటికి ఆటంకం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. మంగళవారం గరుగుబిల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రావివలస ఎంపీటీసీ సభ్యులు కోట భరత్‌కుమార్ స్పందిస్తూ తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కాలువలకు ఆధునీకరణ పనులు నిర్వహించకపోవడంతో సాగునీరు విడుదల సమయంలో అధికంగా గండ్లు పడుతున్నాయన్నారు. అలాగే జంఝావతి కాలువ పరిధిలో పిచ్చి మొక్కలు తొలగింపుతో పాటు పూడికతీత పనులు నిర్వహించకపోవడంతో శివారు ప్రాంత రైతులకు సాగునీరు సరఫరా రావడం లేదని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టు పరిధిలోని రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎంపీపీ రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉబాలు నిర్వహించే సమయంలో ఏటా సాగునీరు సమస్య నెలకొంటుందని, అధికారులు ముందస్తుగా చర్యలు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై జంఝావతి, తోటపల్లి ప్రాజెక్టు అధికారులు స్పందిస్తూ అవసరమైన మరమ్మతులు నిర్వహించి జూలై 3వ వారంలో సాగునీరు విడుదల చేయనున్నట్లు వివరించారు. గ్రామాల పరిధిలో కుక్కల స్వైర విహారం చేయడంతో పాటు అధికంగా దాడులు చేస్తున్నాయని, దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని సంతోషపురం, సుంకి సర్పంచ్‌లు అంబటి తవిటినాయుడు, కరణం రవీంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. మండల పంచాయతీ విస్తరణాధికారి గోపాలరావు మాట్లాడుతూ నిబంధనల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రెవెన్యూశాఖకు సంబంధించి ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో మార్పులు జరుగుతున్నాయని, దీని కారణంగా కొంతమేర రైతుల సమస్యలకు అసౌకర్యంగా ఉందన్నారు. నాడు నేడుకు సంబంధించి నిధులు సమస్య నెలకొనడంతో పలు పాఠశాలల్లో పనులు నిర్వహణ జరగలేదని ఎంఈవో ఎస్.నాగభూషణరావు వివరించారు. శాఖలవారీగా నివేదికలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అర్జునరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలంనాయుడు, మండల అధికారులు ఆర్.విజయభారతి, బి.శంకరరావు, గౌరీశంకరరావు, గౌరునాయుడు, ఎం.గౌరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



భామినిలో పొడి మట్టిలో విత్తనాలు జల్లుతున్న దృశ్యం

పొడి మట్టిలోనే విత్తనాలు

● వర్షం కోసం ఎదురుచూస్తున్నరైతన్నలు

భామిని: మండలంలోని వర్షాలు లేకపోవడంతో రైతులు ఎదురుచూస్తూ పొడి మట్టిలోనే విత్తనాలు జల్లేందుకు సిద్ధమయ్యారు. ప్రతి ఏటా జూన్ 12 నుంచి 15లోగా విత్తనాలు జల్లేవారమని, జూన్ 18వచ్చినా వర్షాలు లేకపోవడంతో విత్తనాలు జల్లేందుకు సాహసిస్తున్నారు. వేసవిలో దుక్కులన్నీ దున్ని సిద్ధం చేయగా ప్రతిరోజూ ఉరుములు, మెరుపులు తప్ప వర్షాలు లేకపోయాయన్నారు. పొడి మట్టిలో విత్తనాలు జల్లితే 20 శాతం విత్తనాలు పోయినా వర్షాలు కురిస్తే 80 శాతం విత్తనాలు దక్కుతాయని రైతులు భావిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి



వీరేష్ చంద్రదేవ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

కురుపాం: ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి సక్రమంగా అందరికీ అందేటట్లు చూడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ కోరారు. మంగళవారం వివిధ శాఖల అధికారులు కురుపాంలో వీరేష్ చంద్రదేవ్ నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఉద్యోగుల సహకారంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి అధికారులు పూర్తిగా సహకరించి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఎంపీడీవో అప్పారావు ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు వీరేష్ చంద్రదేవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగుల పాల్గొన్నారు.

పెదపెంకిలో టీడీపీ సంబరాలు

సీతానగరం: టీడీపీ అఖండ విజయాన్ని పురస్కరించుకుని పెదపెంకి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర చేతులమీదుగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలుపునకు కృషిచేసిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య చేరిన జయకృష్ణ అభిమానులు

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఎన్నికల్లో గెలుపొందడంతో పార్టీ మండల తెలుగు యువత అధ్యక్షుడు మాచర్ల అనీల్‌కుమార్, నాయకులు గోవింద్, గణేష్, ఆర్.రమణ అయోధ్య చేరుకొని మొక్కు తీర్చుకున్నారు. బాలరాముడిని దర్శించుకుని ఆనందం వ్యక్తం చేశారు.



అయోధ్య చేరుకున్న నాయకులు

మంత్రులను కలిసిన రామ్‌మోహనరావు

గరుగుబిల్లి: రాష్ట్ర, కేంద్ర మంత్రులను అరకు బీసీ సెల్ చైర్మన్ బూరాడ రామ్ మోహనరావు మంగళవారం అభినందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్ మోహనరావులను మర్యాద పూర్వకంగా కలిశానిని చెప్పారు. అరకు పార్లమెంటు పరిధిలోని ప్రధాన సమస్యలను మంత్రులకు వివరించానన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపుతామని వారు హామీ ఇచ్చారన్నారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు పుష్ప అందిస్తున్న దృశ్యం

మంత్రి సంధ్యారాణి స్వగ్రామంలో సంబరాలు

మక్కువ: గుమ్మిడి సంధ్యారాణి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరుణంలో ఆమె స్వగ్రామం కవిరిపల్లిలో గ్రామస్థులు మంగళవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. గ్రామస్థుల ఆరాధ్య దేవత ముత్యాలమ్మతల్లికి మొక్కులు తీర్చుకుని విందు ఏర్పాటు చేశారు. మండల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తారని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



కవిరిపల్లిలో విందు భోజనాలు చేస్తున్న దృశ్యం

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

● ఉప విద్యా శాఖాధికారి నారాయుడు

సీతంపేట: మండలంలో బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఐటీడీఏ ఉపవిద్యాశాకాధికారి పి.నారాయుడు ఆదేశించారు. సీతంపేట మండలంలోని కుశిమి, వాబ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, శంబాం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడికి పోతా కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో వంద శాతం అడ్మిషన్లు జరిగే విధంగా చూడాలన్నారు. బడిఈడు పిల్లలు బడిబయట ఉండకూడదని సూచించారు. స్టూడెంట్స్ కిట్ విద్యార్థులందరికీ అందే విధంగా చూడాలని, డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు జరగాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, ఆర్వో ప్లాంట్స్ ద్వారా విద్యార్థులకు శుద్ధజలాలు అందించాలని ఆయన ఆదేశించారు. తాగునీరు విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంవో సీహెచ్ చిరంజీవి, హిమరిక సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



వాబ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ డీఈవో

అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేసేదెవరు?

● ఆక్రమణకు గురవుతున్న వరహాలగెడ్డ

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రం గుండా ప్రవహిస్తున్న వరహాల గెడ్డ రోజురోజుకు ఆక్రమణలకు గురవుతోంది. ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన వీరభద్ర మాల్‌కు వెళ్లేందుకు వరహాల గెడ్డపై నుంచి ఇటీవల సంబంధిత యజమానులు వంతెన నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే వరహాల గెడ్డ పరివాహక ప్రాంతమంతా ఆక్రమణలకు గురవుతుండడం వల్ల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. వేణుగోపాల్ థియేటర్ నుంచి బైపాస్ కాలనీకి వెళ్లే రహదారి వరకు ఎవరికి నచ్చినట్లు, ఇష్టానుసారంగా వంతెనల నిర్మాణం చేపడుతుండడంతో వర్షాకాలంలో వరహాల గెడ్డ వరద నీరు ప్రధాన రహదారిపై నుంచి ప్రవహిస్తుండడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వరహాల గెడ్డలో అక్రమంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని సీపీఎం నాయకులు.. ఇరిగేషన్, మున్సిపల్ ప్రణాళిక విభాగం అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. వరహాల గెడ్డలో వీరభద్ర మాల్ యజమానులు నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ ప్రణాళిక విభాగం నుంచి ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు.

ఆర్డీవోకు ఫిర్యాదు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రం వరహాల గెడ్డలో జరుగుతున్న ఆక్రమణపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్డీవో హేమలతకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించాలని, ఇప్పటివరకు ఉన్న ఆక్రమణలపై దర్యాప్తు నిర్వహించి పూర్తి స్థాయి వరహాల గెడ్డకు రక్షణ కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన మోహన్‌రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రవికుమార్, గౌరీ శంకర్, సురేష్ తదితరులు ఆర్డీవోకు ఫిర్యాదు అందజేసి, సమస్యను వివరించారు.



వరహాల గెడ్డలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వంతెన

సమస్యల పరిష్కారమే లక్ష్యం

● బీజేపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి సుభిక్ష పాలన అందించాలంటే ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. ముఖ్యంగా మన్యం జిల్లాలో ఉన్న జంఝావతి ప్రాజెక్టు వల్ల, సాగునీరు, తాగునీటిని అందించేందుకు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీలు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈనెల 31వ తేదీన జంఝావతి ప్రాజెక్టు సమస్యకు సంబంధించి రైతులతో ప్రాజెక్టు వద్దే ఆయకట్టు రైతులతో ఎన్డీఏ పార్టీలు సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో చిన్న పరిశ్రమల ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పనపై సమగ్ర కార్యాచరణ చేపడతామని చెప్పారు. కొఠియా సమస్యకు సంబంధించి జిల్లా మంత్రి సంధ్యారాణికి వివరించామని, త్వరలోనే ఒడిస్సా, ఆంధ్ర సీఎంలతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అలాగే జంఝావతి ప్రాజెక్టు సమస్యపై ఒడిస్సా ప్రభుత్వంతో చర్చిస్తామని మంత్రి చెప్పారన్నారు. జగన్ సర్కారు హయాంలో జరిగిన లోటుపాట్లును ఎన్డీయే ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నంలో ఉందన్నారు. వచ్చే ఐదేళ్లలో ఉత్తమ పాలనతో పాటు ప్రజల సమస్యల పరిష్కారమే రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఆశయమని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఏఎన్ఎంల నియామకంపై హర్షం

పాలకొండ: గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య సిబ్బంది(ఏఎన్ఎం) నియామకంపై మంత్రి సంధ్యారాణి తొలి సంతకం పెట్టడంపై హర్షం వ్యక్తమవుతోంది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తేజోవతి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో వచ్చిన వెంటనే గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గుమ్మిడి సంధ్యారాణి ఏఎన్ఎంల నియామకంపై తొలి సంతకం చేయడం ఆనందంగా ఉందన్నారు. గతంలో 2014లో ఆరోగ్య సిబ్బందిని నియమించినా 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటిరోజే వారిని తొలగించారని గుర్తుచేశారు. **సీతంపేట:** ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో ఏఎన్ఎంలను భర్తీ చేస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రకటించడం పట్ల ఏపీ గిరిజన సంక్షేమ వసతి గృహాలు, పోస్టుమెట్రిక్ హాస్టళ్ల రాష్ట్ర అధ్యక్షుడు బిడ్డిక రామ్మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఏఎన్ఎంలు నియమించకపోవడం ఎంతో మంది గిరిజన విద్యార్థులు అనారోగ్యం పాలై మృతిచెందిన ఘటనలు ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని ఏఎన్ఎంలను నియమించడం గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల మంత్రికి ఉన్న అంకితభావం కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌పాల్ పాల్గొన్నారు. **గుమ్మలక్ష్మీపురం:** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఏఎన్ఎంల నియామకంపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మొదటి సంతకం చేయడం సంతోషంగా ఉందని జిల్లా గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు విలేకరులతో మంగళవారం మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఏఎన్ఎంల నియామకంపై ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోపే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయం అన్నారు.



పాలకొండ: మాట్లాడుతున్న తేజోవతి

విధుల్లోకి తీసుకోండి

● కమిషనర్‌ను కోరిన వలంటీర్లు

పాలకొండ: తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని వార్డు, గ్రామ వలంటీర్లు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తమను వైసీపీ నాయకులు ఒత్తిడి చేశారని, అందుకే తాము రాజీనామా చేశామని చెప్పారు. తమను విధుల్లోకి తీసుకుని ఆదుకోవాలని కోరారు.

కొత్తవారికి అవకాశం ఇవ్వాలి..

వైసీపీ తరఫున ఎన్నికల్లో ప్రచారం చేయడానికి రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవద్దని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ నాయకుల మాటలు విని రాజీనామాలు చేసి ఆ నాయకులు వెంట తిరిగారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వారి స్థానంలో కొత్తవారికి వలంటీర్లుగా అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. వైసీపీకి కొమ్ముకాసే వలంటీర్లుకు విధుల్లో ఉంచితే ఆ పార్టీకి అనుగుణంగా పనిచేస్తారని ప్రసాదరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వలంటీర్లకు రూ.10వేలు వేతనం పెంచుతామనడం హర్షణీయమన్నారు.



మక్కువ: ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

బలవంతంగా రాజీనామా చేయించారు

మక్కువ: వైసీపీ నాయకులు తమతో బలవంతంగా రాజీనామాలు చేయించారని, రాజీనామాలు వెనక్కి తీసుకుంటామని సరాయివలస, మార్కొండపుట్టి పంచాయతీ వలంటీర్లు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.దేవకుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఇష్టం లేకున్నా వైసీపీ నాయకుల మాటలకు తలొగ్గి రాజీనామా చేశామని, అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

అమ్మవారికి సజ్జ ఘటాలు



భామిని: భామినిలో కీర్తిరాయిదొరల వారసులు అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు మంగళవారం సజ్జ ఘటాలు ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల్లో కొలువుతీరిన పెద్దమ్మతల్లి, నీలమ్మతల్లి, పోతురాజు, పాతపట్నం అమ్మవారు తదితర దేవతలను మంగళవారం ఉదయం నుంచే మేళతాళాలతో పూజించారు. కీర్తిరాయి దొరలు తెచ్చిన సజ్జ ఘటాలకు గ్రామస్థులంతా ముగ్గురాటలతో మొక్కులు చెల్లించేందుకు పెద్దమ్మ తల్లిగుడికి వెళ్లారు. కీర్తిరాయి కృష్ణచంద్రదొర ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తమ కుటుంబంతో పాటు తోటపల్లి మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, సర్పంచ్ రాజేశ్వరి గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం

పాలకొండ: పట్టణంలో ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో కె.సర్వేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్.సంగమేశ్వరరావు, సహాయ అర్చకుడు పి.ప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణం జరిపించారు. పట్టణంలోని 17వ వార్డు కౌన్సిలర్ గుమ్మిడి సింహాద్రి, దమయంతి దంపతులు వివాహాన్ని జరిపించారు. ఈ మహోత్సవంలో మాజీ జడ్పీటీసీ సామంతుల దామోదరరావు, శాసపు సర్వారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పాలకొండ పట్టణంలోని పెద్దకాపు వీధిలో వెలిసిన ఆంజనేయస్వామి ఆరో వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని పూజతో వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి తమలపాకులు, కలశ పూజ చేపట్టారు. ఆలయ ఆవరణలో 1500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఉద్యోగులను ఆదుకోవాలి

పాలకొండ: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకుడు నూతులపాటి భరత్‌భూషణ్‌రాజ్ కోరారు. విజయవాడలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ కె.పద్మావతికి ఆయన మంగళవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా భరత్‌భూషణ్‌రాజ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 32, 143 వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు పరిష్కరించి ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. జీరో సర్వీస్‌తో సాధారణ బదిలీలు జరపాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని డైరెక్టర్ హామీనిచ్చారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన

సీతంపేట: మండలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటి నివారణకు ఆటో, వ్యాన్ డ్రైవర్లకు అవగాహన కల్పించామని ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక సామాజిక భవనంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలకు పాల్పడుతున్నారని, త్రిపుల్ రైడ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉందని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్క డ్రైవర్ నిబంధనలు పాటించాలన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

కొమరాడ: జిల్లాలో రవాణాశాఖ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్వతీపురం సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.రమేష్‌కుమార్, జి.సత్యనారాయణ, బి.కాశీరాంనాయక్ కొమరాడ మండలంలో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. మోటార్ వాహన చట్టంపై అవగాహన కల్పించారు. వాహన పత్రాలు తప్పనిసరి అని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానికి భారీగా జరిమానా పడుతుందని వారు తెలిపారు. ఆటోల్లో సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించరాదని, లగేజీ వాహనాల్లో మనుషులను ఎక్కించరాదని, అధిక బరువు వేయరాదని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా..

9వేల మందికి పీఎం కిసాన్

వీరఘట్టం: మండలంలో 9,059మందికి పీఎం కిసాన్ నిధులు జమ కానున్నాయని ఏవో సౌజన్య తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి వేదికగా 17వ విడత పీఎం కిసాన్ నిధులు విడుదల చేశారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని వీరఘట్టం రైతు భరోసా కేంద్రంలో రైతులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏవో తోపాటు బీజేపీ నాయకుడు వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో మంగళవారం డీఈవో జి.పగడాలమ్మ ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ పాఠశాలలో చేరి విద్యను అభ్యసించాలని, అందుకు తల్లిదండ్రులు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఉత్తమ విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందరూ చదవాలి, ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్లోరినేషన్ చేయాలి

వీరఘట్టం: మండలంలోని గ్రామాల్లోగల ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీవో ఎంవీజీ సుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గ్రామాల్లో వర్షాలు కారణంగా డయేరియా వ్యాధి వచ్చే అవకాశం ఉందని, గ్రామాల్లోని అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకులు క్లోరినేషన్ చేయాలని కోరారు.

విద్యా కిట్లు పంపిణీ

సీతంపేట: పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యా కానుక కిట్లును పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారి-2 దిబ్బ సూర్యచంద్రరావు చేతులమీదుగా వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సవర ప్రసాద్, ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో మృతదేహం

సాలూరు: పట్టణంలోని లక్ష్మీ థియేటర్, చిన్ని లాడ్జీ ఎదురుగా ఉన్న ముళ్ల పొదల్లో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహం ఎవరిది, ఎందుకు చనిపోయాడు అనే విషయాలు తెలియాల్సి ఉందని, పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తామని సీఐ వాసునాయుడు తెలిపారు.

పవన్ దృష్టికి పాలకొండ సమస్యలు

పాలకొండ: పాలకొండ నియోజకవర్గ సమస్యలను డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వివరించారు. మంగళగిరిలో మంగళవారం జరిగిన జనసేన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఇంతవరకు జరిగిన అభివృద్ధి ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్కగా ఉంటుందని పవన్ అన్నారని జయకృష్ణ స్థానిక విలేకర్లకు ఫోన్‌లో తెలిపారు. సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుందామని హామీనిచ్చారని ఎమ్మెల్యే వివరించారు.

ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్డులో పాఠశాల విద్యార్థులకు ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ప్రశాంత్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక ప్రధాన రహదారిలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు గంజాయి మత్తుకు బానిస కావద్దన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.

'మార్కెట్ కమిటీలు కొలువుదీరనున్నాయి'

సాలూరు: త్వరలోనే మార్కెటింగ్ కమిటీలు కొలువుదీరనున్నాయని ఏడీ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలో ఉన్న వ్యవసాయ మార్కెటింగ్ కేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. జిల్లాలో వీరఘట్టాం గ్రామానికి త్వరలోనే రైతు బజార్‌ను ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ జరు గుతుందని అన్నారు. సాలూరులో ఉన్న రైతు బజార్‌ను త్వరలోనే వినియోగంలోకి తీసుకు వస్తామని చెప్పారు. ఇప్పటివరకు మార్కెట్ ఫీజుల ద్వారా జిల్లాలో రూ.2కోట్ల 6లక్షలను వసూలు చేశారని తెలిపారు.